ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 28-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- ప్రజలను అన్ని రంగాల్లో శక్తివంతం చేసేందుకు నాణ్యమైన విద్య ఒక్కటే సరైన మార్గమని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు.
- దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికల కోసం "హ్యూమన్ పాపిలోమా వైరస్ – HPV" టీకా కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభించారు.
- దేశీయ వస్త్ర పరిశ్రమ ఆధునీకరణ, ఉత్పాదకత పెంపుకు 1,500 కోట్ల రూపాయల అదనపు నిధులను మంజూరు చేశామని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ప్రకటించారు.
- న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న పెండింగ్ కేసుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ స్పష్టం చేశారు.
- ఐసిసి టి-20 క్రికెట్ ప్రపంచ కప్ లో వెస్టిండీస్‌తో భారత్ చివరి సూపర్ 8 మ్యాచ్ రేపు ఆడనుంది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రజలను స్వయం సమృద్ధి కలిగిన వారుగా తీర్చిదిద్ది, వారిని అన్ని రంగాల్లో శక్తివంతం చేసేందుకు నాణ్యమైన విద్య ఒక్కటే సరైన మార్గమని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు. కేరళలోని చంగనాశ్శేరిలో గల సెయింట్ బెర్చ్‌మన్స్ కళాశాల శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలలో మాట్లాడుతూ.. ఒకప్పుడు భారతదేశం విదేశీ సాంకేతిక పరిజ్ఞానంపై ఎక్కువగా ఆధారపడేదని, కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిందని గుర్తుచేశారు. ప్రస్తుతం భారత్ సొంతంగా వినూత్న సాంకేతిక ఆవిష్కరణలు చేస్తూ ప్రపంచ దేశాలకు దీటుగా ఎదుగుతోందని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ, గుజరాత్ లోని సానంద్‌లో 'మైక్రాన్ సెమీకండక్టర్ టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్'కు చెందిన "అసెంబ్లీ, టెస్ట్ అండ్ ప్యాకేజింగ్ ATMP" కేంద్రాన్ని ఈరోజు ప్రారంభించారు. దీనితో పాటు, స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన తొలి 'మేడ్ ఇన్ ఇండియా' సెమీకండక్టర్ మెమరీ మాడ్యూళ్ల వాణిజ్య ఉత్పత్తి, ఎగుమతులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ.. ఇటీవల భారత్ వేదికగా జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మన దేశానికున్న సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పామని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

ఇదే కార్యక్రమంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. సెమీకండక్టర్ పరిశ్రమ ఆధునిక సాంకేతికతకు వెన్నెముక వంటిదని, నేడు ప్రపంచ పటంలో భారత్ తనదైన ముద్ర వేసిందని

అభివర్ణించారు. నరేంద్రమోదీ నాయకత్వంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం ఆరు రెట్లు వృద్ధి చెందగా, ఎగుమతులు ఎనిమిది రెట్లు పెరిగాయని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత్-ఈయూ సంబంధాలపై తొలి 'పార్లమెంటరీ సలహా కమిటీ' సమావేశం ఈరోజు దేశ రాజధానిలో జరిగింది. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. భారత్, యూరోపియన్ యూనియన్ భాగస్వామ్యం బలంగా ముందుకు సాగుతోందని, వాణిజ్యం, సాంకేతికత, భద్రత, మొబిలిటీ వంటి విభిన్న రంగాల్లో పరస్పర ప్రయోజనకర అంశాలను చర్చించామని ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులందరూ జాగ్రత్తగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. అక్కడి భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని భారత రాయబార కార్యాలయం తాజా అడ్వైజరీని జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఇజ్రాయెల్‌లో అనవసర ప్రయాణాలను పూర్తిగా మానుకోవాలని కోరింది. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = =

గగనతలంలో ముంచుకొచ్చే ముప్పులను అడ్డుకునేందుకు రూపొందించిన 'అత్యంత స్వల్పశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ' - 'విషోరాడ్స్'Very Short-Range Air Defence System (VSHORADS) పరీక్షలను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ - DRDO విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని చండీపూర్ సమీకృత పరీక్షా కేంద్రం (Integrated Test Range) నుంచి వరుసగా మూడుసార్లు జరిపిన ఈ ప్రయోగాలు సత్ఫలితాలనిచ్చాయి. వివిధ వేగాలతో, విభిన్న ఎత్తుల్లో దూసుకొచ్చే శత్రువుల హై-స్పీడ్ లక్ష్యాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఈ ప్రయోగాలు నిర్వహించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ విజయంపై రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తగా 14 ఏళ్ల బాలికల కోసం "హ్యూమన్ పాపిలోమా వైరస్ – HPV" టీకా కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజస్థాన్‌లో 16 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఎదుర్కొనే చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించడమే కేంద్ర ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని తెలిపారు. ప్రతి ఇంటికి వెన్నెముకగా నిలిచే మహిళల సాధికారత కోసం 2014 నుంచి అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. క్యాన్సర్ ముప్పు నుంచి బాలికలను కాపాడేందుకు చేపట్టిన ఈ హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ఒక చారిత్రక ఘట్టం అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న కేసుల పెండింగ్ సమస్యను పరిష్కరించేందుకు చట్ట, న్యాయ మంత్రిత్వ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల నుంచి జిల్లా కోర్టులు, వివిధ ట్రిబ్యునళ్ల వరకు.. ప్రతి స్థాయిలోనూ కేసుల పెండింగ్‌ను తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో జరిగిన 'ప్రభుత్వ వ్యాజ్యాల సమర్థ నిర్వహణ' సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వ్యాజ్యాలను క్రమబద్ధీకరించడం, పెండింగ్ కేసులను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ వస్త్ర పరిశ్రమను ఆధునీకరించేందుకు, ఉత్పాదకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 1,500 కోట్ల రూపాయల అదనపు నిధులను మంజూరు చేసిందని కేంద్ర వస్త్ర శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ ప్రకటించారు. హర్యానాలోని భివానీలో గల 'టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్స్‌టైల్ అండ్ సైన్సెస్'లో జరిగిన 'గ్లోబల్ టెక్-టెక్స్‌టైల్ కాంక్లేవ్'లో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రోత్సాహకాల వల్ల ప్రపంచవ్యాప్తంగా భారతీయ వస్త్ర పరిశ్రమ ఎగుమతులు నేడు 800 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లాలో బాణసంచా కేంద్రంలో జరిగిన పేలుడు ఘటన పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఒక్కో కుటుంబానికి 2 లక్షల రూపాయల చొప్పున, ప్రమాదంలో గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించారు. ఈ ఘటన పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఆయన స్పందిస్తూ.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని అమిత్ షా ప్రార్థించారు.

= = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ అనిశ్చితి, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. వారాంతానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (BSE) సూచీ సెన్సెక్స్ ఒక వెయ్యి 528 పాయింట్లు పతనమై 81,287 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (NSE) సూచీ నిఫ్టీ 392 పాయింట్లు క్షీణించి 25,179 వద్ద ముగిసింది. అయితే, తాజాగా వెలువడిన భారత Q3 GDP గణాంకాలు బలమైన వృద్ధిని సూచిస్తున్నాయి. దీని ప్రభావం సోమవారం మార్కెట్‌లో కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచకప్‌లో భాగంగా జరుగుతున్న సూపర్-8 గ్రూప్-2 మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకుంది. శ్రీలంకలోని పల్లెకెలె అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో పాకిస్థాన్ జట్టు నిర్ణీత సమయానికి 17.3 ఓవర్లలో, 2 వికెట్లు కోల్పోయి, 191 పరుగులు చేసింది. రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా వెస్టిండీస్‌తో భారత్ చివరి సూపర్ ఎయిట్ మ్యాచ్ ఆడనుంది.
మరోవైపు రంజీ ట్రోఫీలో చారిత్రాత్మక విజయం సాధించి, తొలిసారిగా ఛాంపియన్‌గా నిలిచిన జమ్మూ-కశ్మీర్ క్రికెట్ జట్టుకు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 2 కోట్ల రూపాయల నగదు బహుమతిని ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =